స్థూల ఆదాయంలో 22వ స్థానం



నంద్యాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి):

విజన్ 2047 పేరుతో రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మార్చాలని సీఎం చంద్రబాబు నిశ్చయించుకున్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతి జిల్లా 15 శాతం వృద్ధి రేటు అందుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. దీనికి సంబంధించి వివిధ అంశాల్లో ఆయా జిల్లాలు ఏ స్థానంలో ఉన్నాయి? మెరుగుపడేందుకు తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి? అనే అంశాలపై కలెక్టర్ల సదస్సు రెండో రోజు అమరావతిలో జరిగింది. ఇప్పటికే ఆయా శాఖల పనితీరులో ఏ జిల్లా ఏ స్థానంలో ఉన్నదీ ప్రభుత్వం నివేదికను విడుదల చేసింది. నంద్యాలకు సంబంధించి అన్ని వివరాలను కలెక్టర్ రాజకుమారి సేకరించి గురువారం ఈ సదస్సులో ప్రవేశపెట్టారు. సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

నంద్యాల జిల్లా వ్యవసాయ ప్రధాన జిల్లా. ఎక్కువ ఆదాయం వ్యవసాయ రంగం నుంచే వస్తోంది. పరిశ్రమలు, సర్వీసు రంగాల ఆదాయం కలుపుకుని జిల్లా స్థూల ఆదాయం రూ.33,184 కోట్లతో రాష్ట్ర వాటాలో 2.71 శాతంతో 22 స్థానంలో నిలిచింది. రాష్ట్ర ఆదాయం రూ.12,23,691 కోట్లుగా ఉంది. వ్యవసాయ రంగం నుంచి రూ.13,931 కోట్లతో రాష్ట్ర వాటాలో 3.2 శాతంతో 17వ స్థానం, పరిశ్రమల నుంచి రూ.7,353 కోట్ల రాబడితో రాష్ట్ర వాటాలో 2.34 శాతంతో 19 స్థానం, సర్వీసు రంగం నుంచి రూ.11,900 కోట్లతో 2.47 శాతం వాటాతో 20వ స్థానంలో నిలిచింది.

జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీపీఐకి బ్యాంకు ఖాతాలు లింక్ కావాల్సిన వారి సంఖ్య 1,78,952 మంది ఇప్పటి వరకు 1,77,282 మందికి సంబంధించినవి పూర్తి అయ్యాయి. మొత్తం మీద ఇప్పటి వరకు 99.07 శాతంతో రాష్ట్రంలోనే ముందంజలో ఉంది. కేవలం మరో 1670 మందికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు లింక్ కావాల్సి ఉంది. అలాగే జియో ట్యాగ్ చేయాల్సిన గృహాల విషయంలో నంద్యాల జిల్లా మెరుగ్గా ఉంది. జిల్లాలో 5,97,640 గృహాలకు జియో ట్యాగ్ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 5,80,415 గృహాలు పూర్తి చేసి 97.12 శాతంతో నిలిచింది. మరో 17,225 ట్యాగింగ్ ప్రక్రియలో ఉన్నాయి. ఆరేళ్ల లోపు పిల్లలకు ఆధార్ నమోదు కావాల్సిన వారి సంఖ్య 34,660 ఉండగా, ఇప్పటి వరకు 2324 మందికి మాత్రమే ఆధార్ అందింది. ఇంకా 32,336 మందికి అందాల్సి ఉంది. ఇక పంటల బీమా పథకంలో భాగంగా నమోదు చేయాల్సిన శాతం 16.18గా మాత్రమే ఉంది. రైతులకు పంట బీమా పథకాలపై అవగాహన కార్యక్రమాలను మరింత పెంచాల్సి ఉంది.

జిల్లాలో అక్రమ మద్యం ఏరులై పారుతోందన్న విషయం గణాంకాలను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతోంది. జిల్లాలో నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ గతేడాది ఇదే సమయానికి 866 లీటర్లను సీజ్ చేయగా, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 2035 లీటర్లుగా ఉంది. అక్రమ మద్యం విషయంలో నంద్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. గతేడాది ఇదే సమయానికి 4297క లీటర్లు సీజ్ చేస్తే, ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు ఏకంగా 18946 లీటర్లు సీజ్ చేశారు.

జిల్లాలో 148 గ్రామాల్లో గత ప్రభుత్వం 1,87,899 సర్వే రాళ్లను పాతింది. ఇప్పటి వరకు 25.32 శాతంతో 47,583 రాళ్లపై గత ప్రభుత్వంలో రాసిన వైఎస్ జగన్ పేరును తొలగించారు. ఇంకా 1,40,316 రాళ్లకు సంబంధించిన పనులు సాగుతున్నాయి. ప్రజా సంబంధ ఫిర్యాదులను 68.63 శాతం పరిష్కరించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా 65380.42 ఎకరాల ఫ్రీ హోల్డ్ భూములు ఉండగా, రీ వెరిఫికేషన్ చేసిన అధికారులు 14214.47 ఎకరాల్లో అవకతవకలు జరిగాయని గుర్తించారు.

- మహిళా శిశు సంక్షేమంలో జిల్లా రెడ్ జోన్
- పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలు
- మెరుగుపడాల్సిన అంశాలెన్నో
- కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న రాజకుమారి

మహిళా, శిశు సంక్షేమ శాఖ పరంగా కూడా జిల్లా చాలా వెనుకబడి ఉంది. జిల్లాలో తగిన వయసు లేకుండానే పెళ్లిళ్లు జరిగిన ఘటనలు ఉన్నాయి. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ 590 ఉన్నాయి. పిల్లలకు పోషణ అందించటంలో జిల్లా రెడ్ జోన్‌లో ఉంది. వయసుకు తక్కువ బరువుశాతం, ఎత్తు పెరగకపోవటం వంటి విషయాల్లో నంద్యాల జిల్లా వెనుకబడి ఉంది.





ముఖ్యమంత్రి సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

మెరుగుపడాల్సిన అంశాలు..

సమీక్షలో నివేదించిన అంశాలను ఓసారి పరిశీలిస్తే చాలా విషయాల్లో జిల్లా మెరుగుపడాల్సిన అవసరం ఉందని స్పష్టమవుతోంది. జిల్లాలో నీటి వనరులు పుష్కలంగా ఉన్నా, ఇరిగేషన్ ప్రాజెక్టులకు గేట్ వేగా ఉన్నా జిల్లాలో నీటి పరిస్థితి మెరుగు పడాల్సి ఉంది. చాలా చెరువులను పునరుద్ధరించాల్సిన అవసరం ఉంది. చిన్న తరహా నీటి పథకాల కింద రైతులను భాగస్వామ్యం చేయాల్సి ఉంది. దీని ద్వారా నీటి వినియోగం సామర్థ్యాన్ని పెంచి, నదీ జలాల వనరులను సమర్థంగా వినియోగించుకోవాల్సి ఉందని నివేదికలో సూచించారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పనుల నాణ్యతను మెరుగుపరచాల్సి ఉంది. నీటి నిల్వల పునరుద్ధరణ, అటవీ అభివృద్ధి వంటి ప్రాజెక్టులు గ్రామీణ ఉపాధి హామీ పథకంతో అనుసంధానం చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయి. అలాగే రోడ్ల నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంది.

క్రమశిక్షణతో చదువుకోవాలి

డీఈవో జనార్దన్ రెడ్డి



కేజీబీవీలో పరీక్షను పరిశీలిస్తున్న డీఈవో

బేతంచెర్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి సూచించారు. గురువారం పట్టణ శివారులోని బనగానపల్లె రహదారిలో ఉన్న కేజీబీవీ పాఠశాలను డీఈవో జనార్దన్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు. టీచర్లు పని వేళలు పాటించాలన్నారు. పాఠశాల నిర్వహణ రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అబుదాబి, ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

నేడు 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ

విజయవాడకు వెళ్లిన వివిధ శాఖల ఉద్యోగులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు 'స్వర్ణాంధ్ర-2047' విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి గురువారం మధ్యాహ్నం జిల్లా నుంచి బయలుదేరిన బస్సులను జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా నుంచి వివిధ శాఖలకు సంబంధించిన 300 మంది ఉద్యోగులు, ఆదర్శ రైతులు ఆరు బస్సులలో బయలుదేరి వెళ్లారు. రైతులను ఉద్దేశించి జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం యొక్క శాశ్వతమైన అభివృద్ధికి, సుసంపన్నమైన భవిష్యత్తుకు ఈ విప్లవాత్మక స్వర్ణాంధ్ర ప్రణాళిక ఒక దిశా నిర్దేశం చేస్తుందని చెప్పారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన నవ్యాంధ్రప్రదేశ్‌ను నిర్మించడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఈ అత్యంత ముఖ్యమైన లక్ష్యాన్ని సాధించడానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలని జేసీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో రామునాయక్, డీఆర్డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, సీపీవో వేణుగోపాల్, కలెక్టరేట్ ఏవో రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.



బస్సును ప్రారంభిస్తున్న జేసీ, అధికారులు

కూటమిలో ఉప్పు-నిప్పు..!



కర్నూలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):

సాగునీటి సంఘాల ఎన్నికల నగారా మోగింది. మరో 24 గంటల్లో నామినేషన్ల ప్రక్రియ మొదలవుతుంది. రైతాంగంలో పట్టు సాధించేందుకు రాజకీయ నాయకులు ఈ ఎన్నికలను అస్త్రంగా మలుచుకుంటున్నారు. టీడీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు ప్రత్యేక దృష్టి సారించారు. అయితే.. సాగునీటి ఎన్నికలు కూటమి పార్టీల్లో నిప్పు.. ఉప్పులా పరిస్థితి తయారైంది. టీడీపీ నాయకులు తమకు ఏ మాత్రం ప్రాధాన్యత ఇవ్వడం లేదని, కనీస సమాచారం ఇవ్వకుండానే అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని బీజేపీ, జనసేన నాయకులు నిరసన స్వరంతో ఉన్నారు. అధిష్టానం నిర్ణయాలు మేరకు వివిధ పదవులు పంపకాల్లో కూటమి భాగస్వామ్య పార్టీలు బీజేపీ, జనసేనలకు 30 శాతానికి పైగా కేటాయించాలని అంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో మూడు పార్టీల ఇన్‌చార్జిలు కూర్చొని డబ్ల్యూయూఏ, టీసీ సభ్యుల అభ్యర్థుల ఎంపిక చేయడానికి జిల్లా నాయకత్వం సమన్వయం చేయాలని ద్వితీయశ్రేణి నాయకత్వం కోరుతోంది.

- సాగునీటి ఎన్నికల్లో కూటమి పార్టీల్లో సమన్వయ లోపం
- టీడీపీ ఏకపక్షంగా వెళ్తోందని బీజేపీ, జనసేన నేతల విమర్శ
- అభ్యర్థుల ఎంపికపై తమతో చర్చించలేదని ఆవేదన
- బీజేపీ, జనసేనలకు 30 శాతం డబ్ల్యూయూఏ, టీసీలు ఇవ్వాలని డిమాండ్
- పోటీకి సై అంటున్న వైసీపీ నేతలు
- ఏకగ్రీవం చేసుకోవాలన్న కూటమి నాయకుల వ్యూహం ఫలించేనా..?

ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 14వ తేది సాగునీటి వినియోగదారుల సంఘాల (డబ్ల్యూయూఏ) ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను బరిలో దింపేందుకు ప్రతిపక్ష వైసీపీ సన్నాహాలు చేస్తోంది. పల్లెసీమల్లో చలికాలంలో నీటి సంఘాల ఎన్నికలు రాజకీయ మంటను రాజేశాయి. కర్నూలు జిల్లాలో కేసీ కాలువ, తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ), హెచ్చెల్సీ, గాజులదిన్నె ప్రాజెక్టు, హంద్రీనీవా కాలువ, రాంపురం ఛానల్ కెనాల్ సహా మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో 123 డబ్ల్యూయూఏల్లో పరిధిలో 1,212 మంది టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. నంద్యాల జిల్లా కేసీ కాలువ, తెలుగుగంగ కాలువ, ఎస్సార్బీసీ కెనాల్ సహా మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలో 261 డబ్ల్యూయూఏల్లో 2,480 టీసీ సభ్యులను ఎన్నుకోవాల్సి ఉంది. జిల్లా కలెక్టర్లు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా.. డబ్ల్యూయూఏ ఆథరైజ్డ్ అధికారులు నీటి సంఘాలు ఎన్నికలు జరిగే గ్రామాల్లో నోటిఫికేషన్ పబ్లిష్ చేశారు. శనివారం ఉదయం 9.45 గంటలకు ప్రక్రియ మొదలు కానుంది. అంటే.. మిగిలిన సమయం 24 గంటలే. రెండు జిల్లాలో టీడీపీ కూటమి పార్టీల తరఫున 3,692 టీసీ సభ్యులుగా అభ్యర్థులను బరిలోకి దింపాల్సి ఉంది. టీసీ ఎన్నికల అనంతరం సాయంత్రం 3 గంటల తరువాత ఎంపికైన టీసీ సభ్యులు సమావేశమైన వారిలో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. మేజరు, మీడియం ప్రాజెక్టుల పరిధిలోని సాగునీటి సంఘంలో 12 మంది, మైనర్ ప్రాజెక్టుల పరిధిలోని నీటి సంఘంలో ఆరుగురు టీసీ సభ్యులు ఉంటారు. రెండు మూడు గ్రామాల్లో సాగునీటి పంపకాలు, కాలువల మరమ్మతులు, నిర్వహణలో కీలక బాధ్యతలు, రాజకీయంగా పట్టు ఉండే సాగునీటి సంఘం అధ్యక్ష పీఠం దక్కించుకోవాలంటే ముందు టీసీ సభ్యుడిగా గెలవాల్సిందే. దీంతో రాజకీయంగా గుర్తింపు, ప్రొటోకాల్ ఆశిస్తున్న అధికార కూటమి నాయకులు సాగునీటి సంఘం అధ్యక్ష పదవి కోసం ఎత్తులు వేస్తున్నారు.



కూటమి నేతల్లో సమన్వయం కుదిరేనా..?:

టీడీపీ, బీజేపీ, జనసేన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం నాయకత్వం మొదలుకొని దిగువ స్థాయి సామాన్య కార్యకర్తల వరకు గత అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం కోసం కష్టపడ్డారు. ఆ తరువాత గెలిచిన ఎమ్మెల్యేలు కూటమి భాగస్వామ్య పార్టీల నాయకులు, ఇన్‌చార్జిలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి. గత నెలలో మౌర్యఇన్ హోటల్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి. తిక్కారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో జరిగిన కూటమి పార్టీ సమన్వయం సమావేశంలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు తమను పట్టించుకోవడం లేదని, రాష్ట్ర స్థాయిలోనే కాదు దిగువ స్థాయిలో కూడా సమన్వయంతో ముందుకు వెళ్లాలని పలువురు కూటమి నాయకులు విమర్శించినట్లు తెలిసింది. ఆ సమావేశం తరువాత జరగుతున్న తొలి ఎన్నికలు ఇవి. ఒకటి రెండు నియోజకవర్గాల్లో కాస్త అటుఇటుగా కలసికట్టుగా ముందుకు వెళ్తున్నా.. మెజార్టీ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు తమకు కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని కూటమి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో మమ్ములను పట్టించుకోవడం లేదని, బలం ఉన్న గ్రామాల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కోడుమూరు నియోజకవర్గానికి చెందిన బీజేపీ, జనసేన నాయకులు కొందరు ఓటర్ల జాబితా కోసం శుక్రవారం జలమండలి కార్యాలయానికి వచ్చారు. ఆలూరులో ఇదే పరిస్థితి ఉంది. ఇక్కడ టీడీపీలోనే రెండు వర్గాలు ఆధిపత్యం కోసం ఈ ఎన్నికలను వేదికగా చేసుకున్నారు. తమతో చర్చించకుండానే టీడీపీ నేతలు ఏకపక్షంగా వెళ్తున్నారని బీజేపీ, జనసేన నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మంత్రాలయంలో టీడీపీలోనే రెండు వర్గాలు ఆధితప్యం కోసం అభ్యర్థులను పోటీకి దింపేందుకు సిద్ధపడుతున్నారు. టీడీపీ నాయకత్వం ఏకపక్షంగా వెళ్తుంది.. రాష్ట్ర నాయకత్వం సూచించిన మేరకు డబ్ల్యూయూఏ, టీసీ సభ్యుల్లో మా కోటా మాకు ఇవ్వాల్సిందేని జనసేన ముఖ్యనాయకుడు డిమాండ్ చేస్తున్నారు. ఆదోనిలో డబ్ల్యూయూఏ స్థానాలు తక్కువే ఉన్నా.. బీజేపీ ఎమ్మెల్యే ఉండడంతో మాకు 70 శాతం ఇవ్వాలని ఆ పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. పత్తికొండ, ఎమ్మిగనూరులో కూడా కూటమి నాయకుల మధ్య సమన్వయ లోపం కనిపిస్తుంది. నంద్యాల జిల్లాలో దాదాపుగా ఇదే పరిస్థితి ఉందని తెలుస్తుంది. గ్రామ స్థాయిలో బలమైన పట్టు లేకపోవడంతో ఈ ఎన్నికలపై పెద్దగా దృష్టి పెట్టలేదని, ఎవరైన ఆసక్తి ఉన్నవాళ్లు ముందుకు వస్తే.. టీడీపీ నాయకత్వంతో చర్చించి వారికి అవకాశం కల్పిస్తామని జనసేన నాయకుడు ఒకరు పేర్కొనడం కొసమెరుపు. అయితే.. కూటమి ధర్మం ప్రకారం 30 శాతం డబ్ల్యూయూఏ, టీసీ సభ్యులు ఇవ్వాలని బీజేపీ నాయకుడు ఒకరు కోరుతున్నారు.

మిగతా 6లో

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
జిల్లాలో 9,324 మంది విద్యార్థులకు ప్రయోజనం 7



టమోటా కిలో రూ.1
నాణ్యతను బట్టి రూ.8 దాకా
పత్తికొండ మార్కెట్‌లో భారీగా పడిపోయిన ధర 6

డిగ్రీలో 11 మంది విద్యార్థులు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ 1, 5వ సెమిస్టర్ పరీక్షల్లో 11 మంది విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. 1వ సెమిస్టర్‌లో 5,669కి 4,788, 5వ సెమిస్టర్లో 9,164 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 8,267 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

చరిత్ర చెక్కిన కట్టడం

చరిత్ర కొన్ని అద్భుతమైన ఆనవాళ్లను మిగిల్చి వెళుతుంది. దాన్ని తలచుకున్నా, చూసినా ఆనాటి వైభవమంతా కళ్లకు కడుతుంది. బనగానపల్లె మండలంలోని పాతపాడు గ్రామం వద్ద ఎత్తైన కొండపై బనగానపల్లె నవాబుల కాలంలో నిర్మించిన పాతపాడు బంగ్లా అట్లాంటిది. నేడు అది శిథిలావస్థకు చేరుకుంది. కానీ చరిత్రలో ఒకప్పటి దాని గాంభీర్యత చెక్కుచెదరలేదు. 1908లో బనగానపల్లె నవాబు మీర్‌ఫజిల్ అలీఖాన్ పాతపాడు బంగ్లాను వేసవి విశ్రాంతి భవనంగా నిర్మించారు. సమీపంలో ఉన్న సున్నపు రాళ్లతో ఈ బంగ్లాను నిర్మించారు. సుమారు 116 సంవత్సరాల క్రితం ఈ బంగ్లాను బనగానపల్లె నవాబు వేసవి విడిది కోసం కొండపై నిర్మించుకున్నారు. లోపల నిర్మాణం దెబ్బతినిపోయినా వెలుపలి భాగం మాత్రం ఇప్పటికీ అట్లాగే ఉన్నది. యాగంటికి వెళ్లే మార్గంలో పెద్ద కొండపై తాజ్‌మహల్‌ను తలపించేలా నవాబు తన అభిరుచికి అనుగుణంగా నిర్మించారు. అన్ని కాలాల్లోను ఎంతో చల్లగా ఉండేలా ఈ బంగ్లాను నిర్మించడం విశేషం. కర్నూలుకు 83 కిలోమీటర్ల దూరంలో, నంద్యాలకు 53 కిలోమీటర్ల దూరంలో, బనగానపల్లెకు 8 కిలోమీటర్ల దూరంలో ఈ బంగ్లా ఉంటుంది.

- బనగానపల్లె, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి)



పాతపాడు బంగ్లా

అరుంధతి బంగ్లాగా గుర్తింపు

యాగంటికి వచ్చే భక్తులు తప్పనిసరిగా పాతపాడు బంగ్లాకు వచ్చి సందర్శిస్తుంటారు. అనేక సినిమాలు, సీరియల్‌లు ఈ బంగ్లాలో నిర్మించారు. అరుంధతి సినిమాతో పాతపాడు బంగ్లా కాస్త అరుంధతి బంగ్లాగా మారింది. కోడి రామకృష్ణ దర్శకత్వంలో అనుష్క అరుంధతిగా ఈ చిత్రం నిర్మించారు.




- లోపల శిథిలమైపోయిన బంగ్లా
- పర్యాటకులను ఆకట్టుకుంటున్న నిర్మాణం
- అరుంధతి బంగ్లాగా గుర్తింపు



లోపలి భాగంలో పెచ్చులూడిన దృశ్యం

బంగ్లా చరిత్ర: 1601లో బీజాపూర్ సుల్తాన్ ఇస్మాయిల్ ఆదిల్‌షా నందచక్రవర్తిని ఓడించి బనగానపల్లె కోటను ఆక్రమించుకున్నాడు. ఈ ప్రాంతాన్ని ఆదిల్‌షా సేనాధిపతి 1665 వరకు తన ఆధీనంలో ఉంచుకున్నారు. మహమ్మద్‌బేగ్ బనగానపల్లె జాగీర్‌పై శాశ్వత హక్కుదారుడయ్యారు. అతను చనిపోవడంతో అతని దత్తపుత్రుడు ఫైజ్ అలీఖాన్‌కు బనగానపల్లె కోట ఆధీనంలోకి వచ్చింది. 1686లో బీజాపూర్‌ను ఔరంగజేబ్ ఆక్రమించడంతో బనగానపల్లె కోట మొగలు సామంతుల ఆధీనంలో ఉండేది. 1724లో మొగలుల నుంచి స్వాతంత్ర్యం ప్రకటించుకున్న హైదరాబాద్ నిజాం సామంతులుగా ఉన్న బనగానపల్లె నవాబు పాలన కిందికి వచ్చింది. అయితే 1800లో బనగానపల్లె సంస్థానం బ్రిటిష్ ఇండియాలో కలిసింది. ఈ సంస్థానాన్ని బనగానపల్లె నవాబులు పాలించారు. 1948లో బనగానపల్లె సంస్థానం భారతదేశంలో కలసిపోయింది.



ఆకట్టుకుంటున్న పాతపాడు బంగ్లా:

పచ్చటి పొలాలు, చక్కటి ఆహ్లాదకర వాతావరణం, బెలుంగుహలు, అవుకు రిజర్వాయర్, పాతపాడు బంగ్లా, యాగంటి వంటి చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడ సినిమాలు, సీరియళ్ల షూటింగ్ జరుగుతూ ఉంటాయి. గతంలో యాగంటితో పాటు పాతపాడు బంగ్లాలో కూడా చిన్న చిన్న సన్నివేశాలు చిత్రీకరించారు. తాజాగా యూట్యూబ్, సామాజిక మాధ్యమాల్లో నిర్మించే లఘు చిత్రాలతో పాటు, పలు సినిమాల షూటింగ్‌కు బనగానపల్లె కేంద్రంగా మారుతోంది. స్వీడున్నోడు, శరభ, ఒక పల్లెటూరు ప్రేమకథ, సుమన్ హీరోగా సత్యాగ్యాంగ్, రాయలసీమ లవ్‌స్టోరీ, నేత్ర, బంగారు బాలరాజు, తెనాలి రామకృష్ణ, గద్దలకొండ గణేశ్ తదితర ఎన్నో చిత్రాలు, టీవీ సీరియళ్ల ఇక్కడ నిర్మించారు.

కూటమిలో ఉప్పు-నిప్పు !

(5వ పేజీ తరువాయి)

పోటీకి సిద్ధమవుతున్న వైసీపీ

టీడీపీ కూటమి నాయకులు సాగునీటి సంఘాల టీసీ సభ్యులు, డబ్ల్యూయూఏ అధ్యక్ష పీఠాలను ఏకగ్రీవం చేసుకోవాలని రాజకీయ వ్యూహాలకు పదును పడుతున్నారు. ప్రాజెక్టుల వారిగా పోటీ చేసే టీసీ సభ్యులు, డబ్ల్యూయూఏ అధ్యక్ష అభ్యర్థులను దాదాపుగా ఎంపిక చేశారు. శుక్రవారం కూటమి పార్టీల నాయకులతో చర్చించి తుది జాబితా ప్రకటిస్తామని, సమన్వయంతో ముందుకు వెళ్తామని టీడీపీ జిల్లా ముఖ్యనాయకుడు ఒకరు పేర్కొన్నారు. అయితే.. మేము సైతం పోటీకి సై అంటూ వైసీపీ నాయకులు కూడా సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా ఆలూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆలూరులో 24 సాగునీటి సంఘాలు, 210 టీసీ సభ్యులు, మంత్రాలయంలో 22 సాగునీటి సంఘాలు, 246 టీసీ సభ్యులకు ఎన్నికలు జరుగుతాయి. అన్ని స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థుల అన్వేషణలో వైసీపీ ఎమ్మెల్యేలు నిమగ్నమయ్యారు. దీంతో అక్కడ పోటాపోటీగా ఎన్నికల జరిగే అవకాశం ఉంది. కోడుమూరు, ఎమ్మిగనూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో మెజార్టీ డబ్ల్యూయూఏ టీసీ సభ్యుల ఎన్నికల్లో పోటీ చేసేందుకు వైసీపీ ఇన్‌చార్జిలు రాజకీయ సన్నాహాలు చేస్తున్నారు. నామినేషన్‌లు తిరస్కరణకు గురికాకుండా ఓటరు జాబితాలో పేరు, నీటి తీరువా బకాయి లేకుండా తహసీల్దారులతో నోడ్యూ సర్టిఫికెట్లు తీసుకుంటున్నారు.

కర్నూలు జిల్లాలో నియోజకవర్గాల వారిగా డబ్ల్యూయూఏ, టీసీ, డీసీ స్థానాలు

నియోజకవర్గం	డబ్ల్యూయూఏ	టీసీ స్థానాలు	డీసీలు
కోడుమూరు	23	252	3
ఎమ్మిగనూరు	23	264	3
మంత్రాలయం	22	246	3
ఆదోని	5	42	--
పత్తికొండ	20	144	--
ఆలూరు	24	210	1
పాణ్యం	6	54	--
మొత్తం	123	1,212	10

ఉమ్మడి జిల్లాలో వివరాలు

వివరాలు	కర్నూలు	నంద్యాల
డబ్ల్యూయూఏలు	123	261
టీసీ సభ్యులు	1,212	2,480
డిస్ట్రిబ్యూటరీ కమిటీలు	10	24
ఓటర్లు	1,32,112	3,09,246

మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని

కల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు మద్దతు ధర అందించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు మండలం రేమడూరులో ఆయన పర్యటించి రైతుల కష్టాలను అడిగి తెలుసుకున్నారు. కాటసాని మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించే నాయకుడు రైతుల కష్టాల గురించి ఆలోచిస్తేనే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. గత ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి ఓట్లు వేయించుకుని ప్రజలను మరిచిపోయేలా ప్రభుత్వాలు, నాయకులు ఉండటం దారుణమన్నారు. సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి గెలిచిన అనంతరం హామీలు అమలు చేయడం లేదని ప్రజలు ప్రశ్నిస్తే అక్రమ కేసులుపెట్టి దుర్మార్గ పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. రైతన్నలకు ఇచ్చిన హామీలు అమలు చేసేదాక వారి పక్షాన పోరాటాలు చేస్తామన్నారు. కల్లూరు మండల కన్వీనర్ పెద్ద ఈశ్వరయ్య, రామకృష్ణారెడ్డి, మస్తాన్, నారాయణరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రేమడూరులో వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

జగన్‌ను ప్రజలే తరిమి కొడతారు

'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు ధ్వజం



కర్నూలు అర్బన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రజల మధ్యకు వస్తే వారే తరిమికొడతారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. కర్నూలు నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి జీర్ణించుకోలేని జగన్.. వైసీపీ శ్రేణులకు రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు నివ్వడం సిగ్గుచేటు అని అన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర సంపదను అప్పటి మంత్రులు, సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు దోచుకోవడంతో ప్రజలు ఘోరంగా ఓడించారని అన్నారు. అయినా జగన్‌కు సిగ్గురాలేదని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలో కేవలం 6నెలల్లో ఎన్నో ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, పరిశ్రమలు సాధించారని గుర్తు చేశారు. గతంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బు ఇవ్వక పోవడంపై రైతులు ఆగ్రహంతో ఉన్నారని, గతంలో నీవు బకాయిలు పెట్టిన రైతుల సొమ్మును వారి ఖాతాల్లోకి కూటమి ప్రభుత్వం వేసిందని అన్నారు. ఏ2 విజయసాయిరెడ్డి చంద్రబాబు గురించి అవాక్కులు, చెవాక్కులు పేలడం వింతగా ఉందన్నారు. వైజాగ్‌లో భూ ఆక్రమణలు, అక్రమాలు చేశారని ధ్వజమెత్తారు. అమరావతి, పోలవం నిర్మాణాలు పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుంటే జగన్ జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ఇసుక, మద్యం, లిక్కర్, గంజాయి వంటి మాఫియాల మయమైన వైకాపా పాలన సాగించిందని మండి పడ్డారు. చంద్రబాబు పాలన గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదన్నారు. వైకాపా నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

704 అర్జీల స్వీకరణ

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం 29 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 704 అర్జీలు స్వీకరించినట్లు జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ తెలిపారు. గురువారం ఆదోని రెవెన్యూ డివిజన్‌లోని గోనెగండ్ల మండలం గోనెగండ్లలో 21, నందవరం మండలం హాలహర్వి గ్రామంలో 49, ఎమ్మిగనూరు మండలం కడివెళ్లలో 33, కోసిగి మండలం నేలకోసిగి గ్రామంలో 18, గౌడగళ్లలో 13, మంత్రాలయం మండలం మాధవరంలో 9, మాధవరం తాండాలో 1, పెద్దకడుబూరు మండలం తారాపురంలో 5, ఆదోని మండలం బసాపురంలో 12, నాగనాతహల్లిలో 26, హొళగుంద మండలం హెబ్బటంలో 22, కౌతాళం మండలం వల్లూరు గ్రామంలో 13, కుంబలనూరు గ్రామంలో 11, కర్నూలు రెవెన్యూ డివిజన్‌లోని కర్నూలు అర్బన్ జొహరాపురంలో 13, ఓర్వకల్లు మండలం కాల్వ గ్రామంలో 148, కల్లూరు మండలం లక్ష్మీపురంలో 40, వెల్దుర్తి మండలం బుక్కాపురం గ్రామంలో 13, కోడుమూరు మండలం కోడుమూరు గ్రామంలో 37, కర్నూలు రూరల్ మండలం జి. సింగవరం గ్రామంలో 18, గూడూరు మండలం బూడిదపాడు గ్రామంలో 13, సి. బెళగల్ మండలం కొండాపురం గ్రామంలో 21, పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లోని పత్తికొండ మండలం పందికోన గ్రామంలో 16, క్రిష్ణగిరి మండలం క్రిష్ణగిరి గ్రామంలో 24, మద్దికెర మండలం మద్దికెర ఈస్ట్ గ్రామంలో 45, ఆలూరు మండలం ఆలూరు గ్రామంలో 32, చిప్పగిరి మండలం ఏరూరులో 13, ఆస్పరి మండలం డి. కోటకొండ గ్రామంలో 10, హాలహర్వి మండలం బిళేహాల్ గ్రామంలో 17, దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో 11 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఇందులో ప్రభుత్వ భూములపై ఆక్రమణ, రక్షణ 24, ఏపీ ఆన్‌లైన్ భూములు (పీవోటీ యాక్టు 1977)లో 5 ఫిర్యాదులు, ఇంటి పట్టాల కోసం 8, ప్రభుత్వ భూమి కోసం 33, కుల ధృవీకరణ 1, నిషిద్ధ భూముల జాబితా నుంచి తమ భూములు తొలగించాలనే ఫిర్యాదులు 44, రీసర్వే గ్రీవెన్స్‌లో 47, జీఎస్ డబ్ల్యూఎస్, మీసేవ గ్రీవెన్స్‌లో 1, ఇనామ్స్ గ్రీవెన్స్‌లో 16, భూసేకరణ ఫిర్యాదు 1, ఆర్వోఆర్ కేసులకు సంబంధించి 467, రెవెన్యూ అండ్ అదర్ కోర్ట్స్ 1, వాల్టా యాక్టు 1, ఇతరాలు 56 అర్జీలు వచ్చాయన్నారు.



టమోటా కిలో రూ. 1

- నాణ్యతను బట్టి రూ.8 దాకా
- పత్తికొండ మార్కెట్‌లో భారీగా పడిపోయిన ధర
- చేతులెత్తేస్తున్న వ్యాపారులు
- దిగుబడిని పారబోసి రైతుల నిరసన

పత్తికొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌లో టమోటా ధరలు భారీగా పడిపోయాయి. నాణ్యతను బట్టి గురువారం ధర రూపాయి నుంచి రూ.8 వరకు ధర పలికింది. వ్యాపారులు ఎగుమతిచేసే ప్రాంతాలలో ధరలు అమాంతం పడిపోవడమే ధరలు తగ్గడానికి కారణంగా తెలుస్తోంది. పత్తికొండ వ్యవసాయ మార్కెట్‌కు రోజూ సుమారు 200 టన్నుల టమోటా దిగుబడి అమ్మకానికి వస్తోంది. ఇక్కడ పంటను కొనుగోలు చేసిన వ్యాపారులు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలకు ఎగుమతి చేస్తుంటారు. గత రెండు రోజులుగా ఆ ప్రాంతాల్లో స్థానికంగా పండుతున్న టమోటా దిగుబడులు మార్కెట్లకు వస్తుండడంతో పత్తికొండ మార్కెట్ నుంచి ఎగుమతి అవుతున్న టమోటాకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు తక్కువ ధరకు టమోటాను కొనుగోలు చేశారు. పై మార్కెట్ ధరలను బట్టే తాము పంటను కొనుగోలు చేసి ఎగుమతి చేస్తామని, అక్కడి మార్కెట్లలో ధరలు లేకపోతే తామేమి చేయగలమని వ్యాపారులు చెబుతున్నారు. గ్రేడింగ్ చేసిన పంటను మార్కెట్‌కు తీసుకురావాలని వారు రైతులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

టమోటాను పారబోసిన రైతులు

20 కిలోల బాక్స్‌లు జత రూ.40కి వ్యాపారులు కొనుగోలు చేయడంతో కొందరు రైతులు దిగుబడిని నేలపై పారబోసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరికొందరు రైతులు గిట్టుబాటు ధరకల్పించాలంటూ గుత్తి-పత్తికొండ రహదారిపై 10 నిమిషాలు బైటాయించి నిరసన తెలిపారు.



ఆందోళన చేస్తున్న అన్నదాతలు

టమోటా గంపలు జత రూ.100 చొప్పున కొన్నారు



ఎకరా పొలంలో పంటను సాగు చేశాను. 10 కిలోల కలిగిన 20 గంపల టమోటాను మార్కెట్‌కు తెచ్చాను. వ్యాపారులు జత గంపలు రూ.100 చొప్పున కొనుగోలు చేశారు. కిలో ధర రూ.5 పలికింది.

- రాముడు, రాతన

జత బాక్సుల ధర రూ.40 పలికింది



20కిలోల బాక్స్‌లు 10 మార్కెట్‌కు తెచ్చాను. జత బాక్సులు రూ.40 చొప్పున కొనుగోలు చేశారు. కిలో రూపాయి పలికింది. ప్రభుత్వం టమోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి.

- సోమన్న, హోసూరు

అధికారులకు సమాచారం ఇస్తాం



ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభం నుంచి టమోటా ధరలు ఆశాజనకంగా సాగాయి. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు ప్రాంతాలలో అధిక వర్షాల దాటికి పంటలు దెబ్బతినడంతో ఇక్కడి నుంచి వెళ్లిన టమోటాకు మంచి డిమాండ్ దొరికింది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలలో స్థానికంగా దిగుబడులు రావడంతో మన దగ్గర నుంచి వెళ్లే పంటకు డిమాండ్ తగ్గింది. దీంతో వ్యాపారులు నాణ్యత ఉన్న పంటను మంచి ధరకు, నాణ్యతలేని పంటను తక్కువ ధరకు కొనుగోలు చేసినట్లు గుర్తించాం. టమోటా ధరలపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. రైతుకు గిట్టుబాటు ధరను అందించేందుకు ప్రయత్నిస్తాం. రైతులు కూడా గ్రేడింగ్‌చేసిన పంటను మాత్రమే మార్కెట్‌కు తెస్తే వారికి న్యాయం చేయగలం.

- కార్నలీస్, మార్కెట్‌యార్డు కార్యదర్శి

సదరం సర్టిఫికెట్ల జారీలో
అవినీతిని సహించం

• జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు



వైద్యులతో సమీక్ష నిర్వహిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్ల జారీలో అవినీతికి పాల్పడితే బాధ్యులైన వైద్యులు, ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు హెచ్చరించారు. గురువారం సూపరింటెండెంట్ చాంబరులో సదరం కేసులు, పెండింగ్‌లో ఉన్న జాబితాపై సమీక్ష నిర్వహించారు. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, సైకియాట్రి, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ విభాగాల హెచ్‌వోడీలతో మాట్లాడారు. సదరంపై అప్రూవల్ అయిన పెండింగ్, ఇతర కేసులపై ఆరా తీశారు. అంగవైకల్యం లేని దరఖాస్తుదారులకు, నకిలీ సదరం సర్టిఫికెట్లలో వైకల్యం శాతాన్ని పెంచినట్లు వైద్యులు, ఇతర ఉద్యోగులపై ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సదరం సర్టిఫికెట్ల జారీలో వైద్యులతో సహా ఉద్యోగులందరూ వైకల్య ధ్రువీకరణ పత్రాలను ప్రాసెస్ చేయడంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. సమీక్షలో డిప్యూటీ సూపరింటెండెంట్ డి.శ్రీరాములు, సీఎస్ఆర్ఎంవో బీవీ రావు, న్యూరాలజీ సీనియర్ హెచ్‌వోడీ సి.శ్రీనివాసులు, ఆర్థో హెచ్‌వోడీ కె.శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లల మృతి



గాజులపల్లిలో కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

మహానంది, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలతో పాటు మరో రెండు పెద్ద గొర్రెలు మృత్యువాత పడిన సంఘటన మహానంది మండలం గాజులపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకొంది. గ్రామానికి చెందిన చాకలి రామకృష్ణ గొర్రెలు మేపుతూ జీవనం సాగిస్తున్నారు. పాత శివాలయం వెనుక వైపు ఉన్న పాకల్లో గొర్రె పిల్లల వద్ద కాపల లేని సమయంలో వీధి కుక్కలు దాడి చేసి చంపాయని, దీనివల్ల తనకు రూ.2 లక్షలకు పైగా నష్టం జరిగిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనా స్థలాన్ని పశువైద్యుడు డాక్టర్ శివానంద్, రెవెన్యూ సిబ్బంది పరిశీలించారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రామకృష్ణ కోరారు.

వైసీపీ యువజన నాయకుడి అరెస్టు

కర్నూలు క్రైం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరికిపాటి ప్రేమ్‌కుమార్‌ను కర్నూలు త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఐటీడీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు తిలక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొరికిపాటి ప్రేమ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని సీఐ శేషయ్య తెలిపారు. రాష్ట్రంలో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలంటే టోల్ కట్టాల్సిందే అంటూ ప్రేమ్‌కుమార్ ముఖ్యమంత్రిని ఉద్దేశిస్తూ అసందర్భ వ్యాఖ్యలు చేశారని తిలక్ రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గుంటూరు నుంచి అరెస్టు చేసి కర్నూలుకు తీసుకువచ్చారు. గురువారం రాత్రి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

నాటు సారా తాగి వ్యక్తి మృతి

కొలిమిగుండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో విచ్చలవిడిగా లభిస్తున్న నాటు సారా తాగి ఒక వ్యక్తి మృతి చెం దాడు. ఈ సంఘటన మండలంలోని మీర్జాపురం గ్రామంలో జరిగింది. గ్రామంలో కూలీ పనులు చేసుకొని జీవించే పిక్కిలి రొడ్డ నాగన్న(63) గత రెండు రోజులుగా నాటుసారా తాగుతూ బుధవారం రాత్రి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుమారుడు నాగరాజు సపర్యలు చేసినా తేరుకోలేదు. గురువారం ఉదయం మృతి చెందాడు. కొలిమిగుండ్ల పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న మీర్జాపురం గ్రామంలో నాటు సారా విక్రయం విచ్చలవిడిగా జరుగుతున్నదని, స్థానిక పోలీసులు గానీ, ఎక్సైజ్ పోలీసులు గానీ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



మృతి చెందిన పిక్కిలి నాగన్న

గుండె శస్త్రచికిత్స విజయవంతం

• చిన్న కోతతోనే రోగికి ఆపరేషన్
• సీఎం సహాయ నిధి కింద ప్రాణం పోసిన వైద్యుడు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గూడూరు మండలం మునగాల పాడు గ్రామానికి చెందిన 31 ఏళ్ల గిడ్డయ్య ఓ రైతు. ఆయన గుండెలో ఉండే రెండు కవటాలు మెట్రల్, అయోర్టిక్ రెండూ చెడిపోయాయి. రెండింటినీ కచ్చితంగా అమర్చాలి. రెండు కవటాలు అమర్చడం చాలా ఖరీదుతో కూడుకున్నది. ఈ ఆపరేషన్‌కు డా.ఎన్టీఆర్ వైద్యసేవ కింద రూ.2 లక్షల ప్యాకేజీ ఉంది. అయితే రోగికి ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు లేదు. ప్రైవేటులో ఆపరేషన్‌కు లక్షల రూపాయల ఖర్చు అవుతుంది. ఈ పరిస్థితుల్లో రోగి కర్నూలు జీజీహెచ్‌కు వచ్చి సిటీ సర్జన్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి దగ్గరకు వచ్చారు. ఎలాగైనా ఆపరేషన్ చేయాలని వేడుకొన్నారు. దీంతో సీటీ సర్జన్ డా.సి.ప్రభాకర్ రెడ్డి రోగి కేసును సీఎం సహాయనిధి కింద దరఖాస్తు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ కార్డు లేకపోయినా పేద రైతు కావడంతో ఆయన దరఖాస్తును వెంటనే సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు.



రోగితో సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి

చిన్న కోత పద్ధతిలో..

రోగి పని చేసుకునే వయస్సు. ఎముక కట్ చేస్తే చాలా రోజులు పని చేసుకోలేరు. సిక్ అవుతాడని భావించి సీనియర్ సిటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి ఆయనకు మిని మిల్లీ ఇన్వాసివ్ హార్ట్ సర్జరీ (ఎంఐసీఎస్) చిన్న కోత పద్ధతిలో రెండు వాల్వ్‌లు రిప్లేస్‌మెంటు హార్ట్ సర్జరీని ఈ నెల 11వ తేదీన సీటీ సర్జన్ డా.ప్రభాకర్ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రవీంద్ర దాదాపు 4 గంటలు శ్రమించి ఆపరేషన్‌ను విజయవంతంగా చేశారు. ఈ ఆపరేషన్ రెండు వాల్వు రిప్లె సిమెంటు చేయాలంటే చిన్న కోత పద్ధతిలో కార్పొరేట్‌లో రూ.20 లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సీఎం సహాయ నిధి కింద ఆపరేషన్ నిర్వహించినట్లు డా.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. చిన్న కోతతో ఆపరేషన్ చేయడం వల్ల రోగి త్వరగా కోలుకుంటారని, నొప్పి, రక్తస్రావం తక్కువగా ఉంటుందని వెల్లడించారు.

కళాశాల విద్యార్థులకు
మధ్యాహ్న భోజనం

• జిల్లాలో 9,324 మందికి ప్రయోజనం



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇంటర్మీడియట్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించడం పట్ల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం 2019 వరకు అమలు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం ప్రభుత్వ, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు తిరిగి మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ప్రకటించింది. కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను పెంచేందుకు, పౌష్టికాహారం అందించేందుకు ఈ పథకం చేపడుతున్నట్లు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. దీంతో పేద విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు సేకరిస్తున్న అధికారులు

జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 4 ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో 9,324 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్‌లో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో చదువుతున్నారు. వీరిలో 80 శాతానికి పైగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వారే. కళాశాలలు దూరం కావడంతో ఇంటి నుంచి ఉదయం 7 గంటలకే బయలుదేరి కళాశాలలకు చేరుతున్నారు. చాలా గ్రామాల్లో బస్సు ప్రయాణాలు లేక ఆటోల్లో, బైకులపై వస్తున్నారు. ఆర్థిక స్థోమత లేక అర్ధాకలితో చదువుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన సౌకర్యం కల్పించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తున్నది. విద్యార్థుల సంఖ్య, వంట పాత్రలు, షెడ్లు, నిర్వాహకుల సరుకుల తదితర వివరాలు సేకరిస్తున్నారు.

క్యారియర్ తెచ్చుకోకపోతే ఇబ్బందే



చాలామంది గ్రామాల నుంచి కళాశాలకు వస్తున్నారు. ఉదయం 9 గంటలకే కళాశాలకు చేరుకోవాలి. బస్సు లేకపోతే సమయానికి రాలేక పోతున్నాం. ఇంటి నుంచి ఉదయం 8 గంటలకే బయలుదేరాలి. క్యారియర్ లేకపోతే ఇబ్బంది పడుతున్నాం. **- చంద్రశేఖర్, సీనియర్ ఇంటర్**

గ్రామీణ విద్యార్థులకు మేలు



జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయడం వల్ల గ్రామాల విద్యార్థులకు మేలు. కళాశాల సమీపంలో ఎలాంటి అన్న క్యాంటీన్లు లేవు. భోజనం చేయాలంటే హోటల్‌కు వెళ్లాల్సి వస్తున్నది. అంత డబ్బు పెట్టే స్థోమత లేని విద్యార్థులకు ఈ పథకం మేలు చేస్తుంది. **- కవిత, సీనియర్ ఇంటర్**

మధ్యాహ్న భోజనంతో ప్రయోజనం



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలనుకోవడం మంచి నిర్ణయం. విద్యార్థులకు న్యూట్రిషన్ ఫుడ్ అందుతుంది. పేద విద్యార్థులను పై చదువులకు ప్రోత్సహించేందుకు దోహదపడుతుంది.

- ఎస్. నాగస్వామి నాయక్, ప్రిన్సిపాల్, వృత్తి విద్యా కళాశాల, బి.క్యాంపు, కర్నూలు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

• రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్



క్యాండిల్ లైట్ సర్వీస్‌లో మాట్లాడుతున్న టీజీ వెంకటేష్

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యేసుక్రీస్తు బోధనలు, ఆయన అనుసరించిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుసరణీ యమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని మౌర్య ఇన్ ఫంక్షన్ హాలులో రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆధ్వర్యంలో, నగరంలోని పాస్టర్లతో క్రిస్మస్ క్యాండిల్ లైటింగ్ సర్వీస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తప్పులు చేసినవారు సరిదిద్దుకొని సరైన మార్గంలో నడుచుకుంటే దేవుని దీవెనలు ఉంటాయని అన్నారు. పాస్టర్లు ప్రసాద్, శ్యామేల్, ఏసుబాబు, అవిలాస్ బాబు పాల్గొన్నారు.

శాశ్వత అన్నప్రసాద
వితరణ పథకానికి విరాళం



దాతకు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేస్తున్న అధికారులు

శ్రీశైలం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న శాశ్వత అన్నప్రసాద వితరణ పథకానికి భక్తులు విరాళాలు అందజేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మల్లికార్జున సురంగి అనే భక్తుడు కుటుంబ సమేతంగా కలిసి రూ. 1,01,116 ల విరాళాన్ని, బెంగళూరుకు చెందిన ఎస్. రాజారెడ్డి అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని పర్యవేక్షకుడు మల్లికార్జునకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, స్వామి, అమ్మవార్ల చిత్రపటం, ప్రసాదాలను అందజేసి సత్కరించారు.

ఆశలన్నీ శనగపైనే

• ఉమ్మడి జిల్లాలో 4 లక్షల హెక్టార్లలో సాగు
• రబీలో రారాజుగా నిలుస్తున్న పప్పుశనగ



కొలిమిగుండ్ల మండలంలో కళకళలాడుతున్న శనగ పంట



పురుగు నివారణ కోసం మందు పిచికారీ చేస్తున్న రైతు

కొలిమిగుండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా రైతుల ఆశలన్నీ ప్రస్తుతం శనగపైనే నెలకొన్నాయి. విస్తారంగా సాగు చేసిన శనగ పంట ప్రస్తుతం పూత దశలో ఆశాజనకంగా ఉండటంతో అన్నదాతల ఆశలు రెట్టింపు అవుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సాగు రైతన్నలకు కష్టాలనే మిగిల్చింది. కొన్ని ప్రాంతాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పూర్తి స్థాయిలో సాగుకు నోచుకోకపోవడం, మరి కొన్ని ప్రాంతాల్లో సాగుచేసిన పంటలు ఎండి పోవడం, ఇంకొన్ని ప్రాం తాల్లో అధిక వర్షాలతో పంటలు దెబ్బతిన్న విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఖరీఫ్ సాగు అన్నదాతలకు తీవ్ర ఆవేదన మిగిల్చింది.

రబీలో పప్పు శనగవైపే దృష్టి

ప్రధాన వాణిజ్య పంట అయిన పప్పు శనగ ఉమ్మడి జిల్లాలో రబీ రారాజుగా నిలుస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా రబీ సీజన్ సాధారణ సాగులో 3వ వంతు పప్పు శనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు. దీన్ని బట్టి శనగ సాగుపై ఉమ్మడి జిల్లా రైతుల ఆశలు ఏవిధంగా ఉన్నాయో అర్థమతోతుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది సుమారు 4 లక్షల హెక్టార్లు పప్పు శనగ సాగు అయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం పప్పు శనగ పంట నమోదు కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఇందులో అత్యధికంగా నంద్యాల జిల్లాలోని కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ వ్యవసాయ సబ్ డివిజన్‌లలో పప్పు శనగ సాగు చేశారు.

వర్షాల వల్ల కళకళలాడుతున్న పంటలు

ఇటీవల బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో కురిసిన చిన్నపాటి వర్షాలతో శనగ పంట ఆశాజకంగా మారింది. శనగ సాగు చేసిన తరువాత వర్షం లేక పోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. అయితే తుఫాన్ కారణంగా కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు నమోదు కాగా, మరికొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. అయితే ఈవర్షం కొన్ని పంట లకు తీవ్ర నష్టం కలిగించగా, పప్పు శనగకు మాత్రం ఎంతో మేలు చేసిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పూత దశకు చేరుకున్న శనగ పంట కళకళ లాడుతోంది. తుఫాన్ వర్షంతో శనగ పంట మరింత ఎదుగుదల వస్తోందని, అన్నీ అనుకూలిస్తే శనగ రైతుల పంట పండినట్టేనని పలువురు అంటున్నారు.

మూడెకరాల్లో సాగు చేశాను



మూడు ఎకరాల్లో శనగ పంట సాగు చేశారు. సుమారు రూ.50వేలు పెట్టుబడి పెట్టాను ప్రస్తుతం శనగ పంట ఆశాజనకంగానే ఉంది. **- మార్కె శ్రీరాములు, మీర్జాపురం**

పంట పూత దశలో ఉంది



ఇటీవల కొద్ది రోజుల క్రితం కురిసిన వర్షాలు శనగ పంటకు ఎంతో మేలు చేశాయి. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఎటువంటి వైపరీత్యాలు లేకుంటే దిగుబడి బాగా వచ్చే అవకాశం ఉంది.

- ఆవుల సూర్యనారాయణరెడ్డి, రైతు, కొలిమిగుండ్ల

నాలుగు వాహనాల సీజ్

మంత్రాలయం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఓ అధికారులు గురువారం రికార్డులు లేని నాలుగు వాహనాలను సీజ్ చేసి మాధవరం, మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో అప్పగిం చారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలం గాణ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాల నుంచి అనుమతులు లేకుండా వాహనాలు వస్తే సీజ్ చేస్తామని ఆదోనీ ఆర్టీవో కేఎండీ ఆవాజ్ అన్నారు. రోడ్డు నిబంధనలు పాటిస్తూ సరిగ్గా రికార్డులు ఉండాలని తెలిపారు. తనిఖీల్లో మంత్రాలయం ఎస్ఐ పరమేష్ నాయక్, వీరేష్, వీరాంజనేయులు, భాస్కర్ పాల్గొన్నారు.

18న హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బి.క్యాంపు క్రీడా మైదానంలో ఈనెల 18న జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ మహిళా జట్టుకు క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వి.సువర్ణ గురువారం తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెంలో జరిగే రాష్ట్ర స్థాయి మహిళా హ్యాండ్‌బాల్ చాంపి యన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

'మోహన్‌బాబుపై కేసు నమోదు చేయాలి'



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కర్నూలు కల్చరల్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఓ చానల్ రిపోర్టర్‌పై దాడి చేసిన సినీ నటుడు మోహన్ బాబుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు గోరంట్ల కొండప్ప, కె.నాగరాజు, ఏపీయూడబ్ల్యూజే జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్వీ సుబ్బయ్య, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాస గౌడ్ డిమాండ్ చేశారు. మోహన్‌బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ గురువారం కర్నూలు కలెక్టరేట్ గాంధీ విగ్రహం వద్ద ఏపీయూడ బ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలిపారు జేఏసీ నాయకులు టీజీ ప్రసాద్, ఏపీడబ్ల్యూజేఎఫ్ కన్వీనర్ నాగేంద్ర, ఏపీజేఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రామకృష్ణ, సాయికు మార్ నాయుడు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని కోరారు. జిల్లా కోశాధికారి అంజి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ నాయకులు చంద్రశేఖర్, నాగిరెడ్డి, హరికిషన్, సురేష్, సుంకన్న, హుస్సేన్, ఖలీల్, మధుసూదన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు దస్తగిరి, సహాయ కార్యదర్శి అవినాష్, జిల్లా కార్యవర్గ సభ్యులు మధు, భాస్కర్, నాగేంద్రప్రసాద్, వీడియో జర్నలిస్టులు మోహన్, రాజు, చంద్రశేఖర్, సురేంద్ర, శివ, రమేష్ పాల్గొన్నారు.



నందికొట్కూరులో ధర్నా చేస్తున్న నాయకులు



నంద్యాలలో విద్యుత్ చార్జీల స్లిప్‌లను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



ఆత్మకూరులో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

విద్యుత్ చార్జీల భారం తగదు

● సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు

నంద్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని సీపీఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, సీనియర్ నాయకులు తోటమద్దులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో నంద్యాలలోని గాంధీచౌక్ సెంటర్‌లో సోమవారం నిరసన చేపట్టారు. విద్యుత్‌చార్జీల స్లిప్‌లను సీపీఎం నాయకులు దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలని సెకీ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని, అవినీతికి పాల్పడినవారిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటలింగం, జైలాన్, సుబ్బారావు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: విద్యుత్ చార్జీల పెంపుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం నందికొట్కూరు పట్టణంలోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీల పెంపుదలను నిరసిస్తూ కరెంటు బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు ఐదు సంత్సరాలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే వాటిని ధ్వంసం చేస్తామని చంద్రబాబు నాయుడు, లోకేశ్ ప్రజా వేదికలపై రాష్ట్ర ప్రజలకు హామీలుచ్చారన్నారు. విద్యుత్ ట్రూ ఆప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ చార్జీల పేరుతో అసలు కంటే కొసరు ఎక్కువ వేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, బెస్తరాజు, నాగన్న, ఉస్మాన్‌బాషా, కార్పెంటర్ అబ్దుల్ రషీద్, బోయ నాయుడు, బాలస్వామి హమాలీ కార్మికులు పాల్గొన్నారు.



పగిడ్యాలలో విద్యుత్ బిల్లుల ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పగిడ్యాల: పెంచిన విద్యుత్ చార్జీలతో సామన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ పక్కీర్‌సాహెబ్ ప్రభుత్వనికి డిమాండ్ చేశారు. పెరిగిన విద్యుత్ చార్జీలకు నిరసనగా పగిడ్యాల బస్టాండ్ ఆవరణంలో ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి విద్యుత్ బిల్లులను గురువారం దగ్ధం చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు గంధం ఉసేనమ్మ, ఈశ్వరమ్మ, మద్దమ్మ, తిక్కస్వామి, సామేలు ,బీరమ్మ తదితరులు ఉన్నారు.

ఆత్మకూరు: రాష్టంలో కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం నాయకులు రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, వీరన్నలు పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు పట్టణంలోని గరీబ్‌నగర్, ఏకలవ్యానగర్, అర్బన్‌కాలనీ, గొల్లపేట ఏరియాల్లో విద్యుత్ బిల్లులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడం సరికాదని అన్నారు. అదేవిధంగా గతంలో స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయండని పిలుపునిచ్చిన మంత్రి లోకేష్ నేడు స్మార్ట్ మీటర్లను పూనుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కిరణ్, దానమ్మ, సువర్ణమ్మ, చిన్నవలి, లక్ష్మీదేవీ, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

15న నల్ల చట్టాల వ్యతిరేక సభ



మాట్లాడుతున్న మౌలానా అబ్దుల్లా

నంద్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మైనార్టీలకు వ్యతిరేకంగా ప్రవేశపెట్టనున్న నల్ల చట్టాలను నిరసిస్తూ 15న కడపలో జమియాతె ఉలామా - ఏ -హింద్ ఆధ్వర్యంలో నిర్వహించే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని నంద్యాల ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాదీ, గౌరవాధ్యక్షుడు మహమ్మద్ అబులైస్ పిలుపునిచ్చారు. గురువారం నంద్యాలలోని ఢబ్రాయిల్ మస్జిద్‌లో జరిగిన జేఏసీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మైనార్టీల పట్ల వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, వక్ఫ్‌బోర్డు ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు అమలు చేయాలనుకుంటున్న వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 1991లో పార్లమెంట్ ఆమోదించిన ప్రార్థనా స్థలాల చట్టం ప్రస్తుతం ఉన్న మస్జిద్‌లు, దేవాలయాలు, చర్చిలు యథావిధిగా కొనసాగాలని చెబుతున్నా కొంత మంది హైకోర్టు న్యాయమూర్తులు ఇటువంటి ప్రార్థనా స్థలాలపై వచ్చిన పిటిషన్లను ఆమోదించి సర్వేలకు అనుమతివ్వడం ద్వారా రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, జాతీయ ఐక్యత, దేశప్రజల సమానత్వం, దేశాభివృద్ధి కోసం జరిగే సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కో కన్వీనర్లు సద్దాం హుసేన్, మస్తాన్, జేఏసీ సభ్యులు ఉస్మాన్, అబ్దుల్‌మునీర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ మధుసూదన్‌రావు

నంద్యాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్ చెస్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో జరిగిన పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా 26జిల్లాలనుంచి క్రీడాకారులు వచ్చారు. రామకృష్ణ విద్యాసంస్థల చైర్మన్, క్రీడాభారతి రాయలసీమ జోన్ అధ్యక్షుడు డా.రామకృష్ణారెడ్డి, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ, ఐఎంఏ నంద్యాల శాఖ అధ్యక్షుడుడా.మధుసూదన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. 26జిల్లాలనుంచి 170మంది క్రీడాకారులు పాల్గొంటున్నారన్నారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచినవారు రాష్ట్ర జట్టునుంచి జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, లయన్స్‌క్లబ్ నంద్యాల అధ్యక్షుడు నిజాముద్దీన్, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత యోగ శిక్షణా తరగతులు

నంద్యాల కల్చరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్‌పార్కులోని ఆయుష్ యోగా కేంద్రంలో శుక్రవారం నుంచి ఉచిత యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ తెలిపారు. శుక్రవారం ఉదయం 5.20గంటల నుంచి 6.40గంటలవరకు, రెండో బ్యాచ్ ఉదయ 6.45 గంటల నుంచి 7.45 గంటల వరకు శిక్షణా తరగతులు ఉంటాయన్నారు.

నాటుసారా విక్రేతల అరెస్టు

ఆత్మకూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సిద్ధాపురం గ్రామంలో నాటుసారా విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబడిన సమాచారం మేరకు సిద్ధాపురం గ్రామంలో మాణిక్యం, మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు నాటుసారా రవాణా చేస్తుండగా దాడులు చేపట్టినట్లు తెలిపారు. ఈ దాడుల్లో 30 లీటర్ల నాటుసారాతో పాటు ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జగదీష్, సిబ్బంది ఉన్నారు.

నీటి సంఘాల ఎన్నికల అధికారులకు శిక్షణ

మిడుతూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలముడిపి, చింతలపల్లి, జలకనూరు గ్రామాల్లో నిర్వహించే నీటి సంఘాల ఎన్నికల అధికారులకు గురువారం శిక్షణ ఇచ్చారు. శిక్షణలో నామినేషన్ చేయించే విధానం, ఏకగ్రీవాలు కాకుంటే స్లిప్పుల ద్వారా ఎన్నికలు నిర్వహించాలని ఎంపీడీవో దశరథరామయ్య సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కిశోర్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ ఏఈ వేదనారాయణ, వ్యవసాయ అధికారి పీరునాయక్ పాల్గొన్నారు.

నీటి ఎన్నికల నిర్వహణకు పటిష్ట చర్యలు



ఓటరు లిస్టులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

గడివేముల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నీటి సంఘ ఎన్నికల నిర్వహణకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎస్ఐ నాగార్జునరెడ్డితో సమావేశమయ్యారు. నీటి సంఘ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. నీటి సంఘ ఎన్నికలలో ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు.

బాలికల ఉజ్వల భవితకు కిశోర వికాసం



తిమ్మాపురంలో కిశోర వికాసం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

మహానంది, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సు బాలికలు, బాలికల బంగారు భవిష్యత్తుకు నాంది కిశోర వికాసం అని నంద్యాల జిల్లా ఐసీడీఎస్ సీడీపీవో లీలావతిదేవి అన్నారు. గురువారం మహానంది మండలం ఎం.తిమ్మాపురం ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఆవరణలో కిశోర వికాసం-2 మండల స్థాయి ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు. సీడీపీవో చేత జ్యోతి ప్రజ్వలన చేశారు. కిశోర వికాసం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహమ్మద్ దౌలా, ఎంఈవో రామసుబ్బయ్య, ఈఓఆర్డీ నాగేంద్రుడు,పీహెచ్ఎం అమీనాబీ పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరురూరల్ డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జయసూర్య, నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. మండలంలోని వడ్డెమాను గ్రామంలో ఉపాధి నిధుల కింద రూ. 43లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పల్లె అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వైసీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

● నందికొట్కూరు మండలంలోని మల్యాల గ్రామంలో నూతన సచివాలయ భవనం, హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే జయసూర్య ప్రారంభించారు.ఈ సచివాలయం భవనం ఉపాధి హామీ పథకం నిధుల కింద ఈ భవనానికి రూ.38.5 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ. 20.80 లక్షలు నిధులతో నిర్మించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ప్రతి పనిని ఈ కూటమి ప్రభుత్వం ఎలాంటి రాజకీయ కక్ష్యసాధింపులేకుండగా నిధులను మంజూరు చేసి పనులు పూర్తిచేస్తుందన్నారు. గ్రామాల్లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఏఈలు, సర్పంచ్‌లు, చిన్న నాగలక్ష్మయ్య, రామచంద్రుడు, నాయకులు సత్యంరెడ్డి, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

గ్రామ సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

నంద్యాల రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా పంచాయతీ అధికారి జమీవుల్ల తెలిపారు. నంద్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సు గుణశ్రీ అధ్యక్షతన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జమీవుల్ల మాట్లాడుతూ గ్రామాల్లో ప్రధానంగా పేదరిక నిర్మూలన, తాగునీరు, జీవనోపాధుల కల్పన, మహిళాసాధికారిత వంటి అంశాలలో విశ్లేషణలు చేసి, ప్రాధాన్యత అంశాలపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రణాళికల రూపకల్పన, ఆచరణ చేయడం వల్ల గ్రామాలు సుస్థిరాభివృద్ధి సాధిస్తాయని అన్నారు. శిక్షణలో అవగాహన పెంచుకున్న అంశాలను సచివాలయ సిబ్బందికి వివరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఈవోఆర్డీ శివనాగజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లు, కార్యదర్శులదే కీలకపాత్ర అని ఎంపీఈవో దస్తగిరి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మీనరసింహ, ఈవోపీఆర్డీ రామకృష్ణవేణి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పరిశుభ్రత, సురక్షిత నీరు, కలుషితం కాని ఆహారం తీసుకోవాలని సూచించారు. శిక్షణలో మండల అధ్యక్షుడు చిన్న సంజీవరెడ్డి, ఏపీవో వసుధ, సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

పగిడ్యాల: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలని ఎంపీడీవో సుమిత్రమ్మ అధికారులకు సూచించారు. ఎంపీడీవో కార్యలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధిపై గురువారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో సిబ్బందితో కలిసి సమస్యలపై ఆరా తీసి వాటిని పరిష్కరించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

గడివేముల: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికను రూపొందించుకోవాలని ఎస్ఐఆర్‌డీ స్టేట్ కో-ఆర్డినేటర్ నాగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలోని మండలపరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో వాసుదేవగుప్త ఆధ్వర్యంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 2030 నాటికి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని అన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి

వెలుగోడు: ప్రభుత్వం ఇచ్చే శిక్షణలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో, సర్పంచులు, సచివాలయం, ఐసీడీఎస్ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై నిర్వహించే ఈ శిక్షణలో ప్రతి ఒక్కరు శిక్షణ పొంది గ్రామాలభివృద్ధికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మురారీ, ఏఓ పవన్ కుమార్, ఏఓ నరసింహారెడ్డి, వేల్పనూరు హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మిడుతూరు: గ్రామ స్థాయిలో సుస్థిర అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలని ఎంపీడీవో దశరథరామయ్య అన్నారు. గురువారం మిడుతూరు మండలంలోని వివిధ గ్రామాల్లోని సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు ఈవోఆర్‌డీ సంజన్న ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ రేణుకా దేవి, పీఆర్ ఏఈ ప్రతాప్ రెడ్డి, సిహెచ్‌వో సుబ్బా రెడ్డి పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని గ్రామాల అభివృద్ధికి ప్రతి అధికారి, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో కృషి చేయాలని ఎంపీపీ కిచ్చన్నగారి సుమలత, జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి, ఎంపీడీవో మేరీలు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ భవనంలో అదికారులు, సర్పంచులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ సమన్వయంతో గ్రామాల అభివృద్ధికి పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే ధాన్యం

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
● ధాన్యం ఆరబోతకు ప్లాట్‌ఫారాలు కరువు
● పట్టించుకోని అధికారులు ● ఇబ్బంది పడుతున్న రైతులు

పాణ్యం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు కష్టపడి పండించిన ధాన్యం ఆరబోసేందుకు అనువైన స్థలాలు లేవు. దీంతో ప్రధాన రహదారులపై ఆరబెట్టుకోవాల్సి వస్తోంది. తుఫానులతో ఎండ లేకపోవడం, పంట భూములు తడిఆరకపోవడంతో రైతులు ధాన్యాన్ని అరబెట్టేందుకు రహదారులను ఎంచుకున్నారు. రహదారులు చిన్నగా ఉండడంతో ఎదురుగా వస్తున్న వాహనాలకు ఇబ్బందిగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో బలపనూరు వద్ద సర్వీసు రోడ్డుపై ధాన్యం ఆరబోయడంతో తండ్రి, తల్లి, కూతురు మృత్యువాత పడ్డారు. పాణ్యం మార్కెట్ యార్డులో నిర్మించిన ప్లాట్‌ఫారాలు నిరుపయోగంగా మారడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఈ యార్డులో గొర్రెల సంతను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో ధాన్యం ఆరబోయడానికి ప్రత్యేకంగా ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



పాణ్యం, బనగానపల్లె ఆర్అండ్‌బీ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం



నిరుపయోగంగా మారిన మార్కెట్ యార్డులోని ప్లాట్ ఫాం

సేవలు పలువురికి ఆదర్శం

● మున్సిపల్ కమిషనర్ బేబి



దుప్పట్లను పంపిణీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్

నందికొట్కూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు సేవ చేయాలన్న సదుద్దేశం పలువురికి ఆదర్శప్రాయమని మున్సిపల్ కమిషనర్ బేబి అన్నారు. గురువారం ఎబినేజర్ చర్చి మారుతి నగర్ పాస్టర్ యాకోబు ఆధ్వర్యంలో పట్టణంలోని బైరెడ్డి నగర్‌లోని పేదలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించి, దుప్పట్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ. నాసీర్, తదితరులు పాల్గొన్నారు.

వేసవికి ముందస్తు చర్యలు తీసుకోండి



సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

నందికొట్కూరు పట్టణంలోని ప్రజలకు వచ్చే వేసవిలో ఎలాంటి తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను మున్సిపల్ కమిషనర్ బేబి ఆదేశించారు. గురువారం అందించేందుకు నందికొట్కూరు పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు తాగునీరు అందించే సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను మున్సిపల్ కమిషనర్ బేబి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నింపుకోవాలని, అందుకు తగిన విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపాలిటీ డీఈనాసిర్, ఏఈ దినేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించకుండా ఎలా ఎన్నికలు నిర్వహిస్తారు?

కొత్తపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో నీటి సంఘాల ఎన్నికలపై గ్రామాల్లో ఉన్న ఓటర్లకు ఎటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించకుండా ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని జడ్పీటీసీ సోముల సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఎంపీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో 4వేల మందికి పైగా రైతులు నీటి సంఘాల ఎన్నికల్లో వారి ఓటు హక్కును వినియోగించుకుంటున్నారని అన్నారు. ఓటర్లు ఏ విధంగా ఓటు వేయాలి.. ఏ బూత్‌లో ఓటు వినియోగించుకోవాలనే విషయాలను ఓటర్లకు అవగాహన కల్పించకుండా అధికారులు ఎన్నికలు ఏర్పాట్లు ఎలా చేస్తారని ప్రశ్నించారు.

ఘనంగా విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలు



మాట్లాడుతున్న ఫాతిమా

నందికొట్కూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు 65వ విభిన్న ప్రతిభావంతుల వారోత్సవాలను నందికొట్కూరులో ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని జై కిసాన్ పార్కులో జిల్లా విక్యాంగుల పోరాట సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఫాతిమా మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన పరికరాలకు అర్హులైన ప్రతి ఒక్కరు తమకు అవసరమైన పరికాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. విభిన్న ప్రతిభావంతుల హక్కుల చట్టం 2016 పకడ్బందీగా అమలు చేయాలని రిటైర్డ్ జిల్లా జడ్జి మోహన్‌రావు సూచించారు. కార్యక్రమంలో మెప్మా శాంతకుమారి, ఎంఈవో సుభాన్, ఏపీఎస్ఆర్టీసీ మరియు నర్సింహ రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భవిత స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న దత్తజయంతి

ఆత్మకూరురూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో వెలసిన షిరీడీసాయిబాబా ఆలయంలో 14న శనివారం దత్తజయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు సూర్యనారాయణ గురువారం తెలిపారు. శనివారం ఉదయం ఆలయంలో 6గంటలకు కాకడహారతి, 7.30గంటలకు సాయినాధుడికి నవవిధ అభిషేకాలు, పుష్పార్చన పూజాదికాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 8.30గంటలకు దత్తాత్రేయ స్వామి ప్రదక్షిణలు, 10.30గంటలకు సాయిసత్య వ్రతాన్ని ఉంటుందన్నారు. రాత్రి 7గంటలకు సాయిబాబా భజన మండలి వారిచే భజన కార్యక్రమాలు, రాత్రి 7.30గంటలకు పల్లకిసేవ, 9గంటలకు శేజాహారతితో పాటు మహామంగళహారతితో ఉత్సవ క్రతువు ముగుస్తుందని తెలిపారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా అబ్జర్వర్ వెంకటరత్నం

దొర్నిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దొర్నిపాడు మండల పరి షత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో సావిత్రి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అబ్జర్వర్ వెంకటరత్నం పలు సూచనలు, సలహాలు అందించారు. ఎంపీడీవో సావిత్రి మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న నిధులను సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని అన్నారు. అర్హులంద రికీ సంక్షేమ పథకాలు అందజేయాలని అన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధించడమే లక్ష్యం

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలో సుస్థిరాభి వృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పరిశీలకులు వెంకటరత్నం అన్నారు. చాగలమర్రి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమా వేశ భవనంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, సచివాలయాల సిబ్బంది శిక్షణా కార్యక్రమా న్ని జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ తాహిర్‌హుసేన్, ఏవో రంగనేతాజీ, వైద్యులు ఇమ్రాన్, పశువైద్యాధికారి సాయిబాబా, ఏఈవోలు కొండారెడ్డి, జగ్గయ్య, షాజహా న్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలి

బనగానపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ గ్రామ పం చాయతీలుగా తీర్చిదిద్దడానికి ప్రజాప్రతినిధులు, గ్రామ సచివాలయ సిబ్బంది కృషి చేయాలని బనగానపల్లె ఎంపీడీవో రమణ కోరారు. బనగానపల్లె పట్టణంలోని పొదుపు భవనంలో గురువారం వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారు లు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించా రు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సతీశ్‌రెడ్డి, పలుకూరు ఈవో బాలాంజనే యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

శిరివెళ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల పరిషత్ కార్యాల యంలో ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, పంచాయ తీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాల పై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని వనరుల ను సద్వినియోగం చేసుకుని సంపద సృష్టించుకోవాలన్నారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి శివారెడ్డి ఈ శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి

కోవెలకుంట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి చెందుతాయని ఎంపీడీవో వరప్రసాద రావు, ఈవోఆర్డీ ప్రకాశ్‌నాయుడు తెలిపారు. గురువారం కోవెలకుంట్ల లోని ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచా యతీ కార్యదర్శులు, సచివాయలాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

రుద్రవరం: పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం రుద్రవరం మండల పరిషత్ కార్యాల యంలో సర్పంచ్, కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎంపీడీవో అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు శివ కృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి తీరుపై ఆందోళన

ప్యాపిలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టలపల్లి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడి తీరుపై గురువారం పాఠశాల ఎదు ట గ్రామస్తులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు నారా యణస్వామి, శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడు మద్యం సేవించి విధులకు వస్తున్నారని ఆరోపించారు. ఎంఈవోకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవ డంతో జిల్లా విద్యాశాఖ అధికారికి తీసుకపోనున్నట్లు తెలిపారు.

కాలం చెల్లిన శీతల పానియాలు సీజ్

డోన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం కేవీఎస్ కాలనీ మహాలక్ష్మి హాస్పిటల్ సమీపంలో స్మార్ట్ బజారులో గురువారం ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించా రు. ఈ తనిఖీలో కాలం చెల్లిన శీతల పానియాలను గుర్తించారు. వాటి ని సీజ్ చేసి తదుపరి చర్యలకు జాయింట్ కలెక్టర్ నివేదిస్తామని ఉమ్మడి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కుర్మా నాయక్ అన్నారు. ఈ తనిఖీల్లో ఆయన వెంట ఫుడ్‌సేఫ్టీ అధికారులు రాముడు, కాశీంవలి ఉన్నారు.

ధాన్యం బస్తాల ట్రాక్టర్ బోల్తా

రుద్రవరం, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నకమ్మలూరు మెట్ట సమీపంలో గురువారం గుంతల ఆర్‌అం డ్‌బీ రహదారిలో వెళ్తూ ధాన్యం బస్తాల ట్రాక్టర్ గురువారం బో ల్తా పడింది. పెద్దకంబలూరు గ్రామం నుంచి వెళ్తూ మార్గమ ధ్యంలో ట్రాక్టర్ బోల్తా పడింది. రుద్రవరం - శిరివెళ్ల రహదారిలో ఆర్‌అండ్ రహదారి గుంతల మయమైంది. ఈ రహదారిలో ట్రాక్టర్ బోల్తా పడడంతో ఇరువైపులా వాహనాలు జామ్ అయి వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

రాజోలిలో వరి పంట కోత ప్రయోగం

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి గ్రామంలో ఏవో రంగనేతాజీ పర్యవేక్షణలో గురువారం ఏఈవో మంజుల ఇన్సూరెన్స్ అధికారి శంకర్, ఏంపీఈవో శ్రావణి ఆధ్వర్యంలో వరి పంట కోత ప్రయోగం చేశారు. రైతు సాంబశివుడు పండించిన వరి ధాన్యాన్ని కొలతలు తీసి దిగుబడిని అంచనా వేశారు. దిగుబడి అధికంగా వచ్చిం దని ఏఈవోలు పేర్కొన్నారు.

గ్రామాల్లో పశుగణన

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో పశువైద్య సిబ్బంది పశుగణన చేపట్టారు. మండలంలోని డి.వనిపెంట గ్రామంలో సచివాలయ, పశువైద్య సహాయకులు ప్రదీప్, ఇంజనీరింగ్ సహాయకులు శివ, బ్రహ్మయ్య ఇంటింటికి తిరిగి పశుగ ణన చేపట్టారు. ఈ సందర్భంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పశుగణన చేపట్టినట్లు వారు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కోవెలకుంట్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కోవెలకుంట్ల పట్టణం లోని సంతపేటలో ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి వద్ద 15500 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ మల్లికా ర్జునరెడ్డి తెలిపారు. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో తమ సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న 12 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నగదును స్వాధీనం చేసుకొని వారిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నరేష్ జిల్లా స్థాయి జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీడీ దాదాపీర్ తెలిపారు. అండర్-19 స్కూల్‌గేమ్స్‌లో 16న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో జరిగే బేస్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థి నరేష్‌ను హెచ్‌ఎం శాస్త్రి సీనియర్ ఉపాధ్యాయులు అభినందించారు.



యర్రగుంట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న రెవెన్యూ అధికారులు



కొలుములపల్లె సభలో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రకాష్‌బాబు

ప్రతి అర్జీని పరిష్కరించాలి

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జనార్దన్‌రావు

శిరివెళ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్క రించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జనార్దనరావు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మండలం లోని యర్రగుంట్ల గ్రామంలో గురువారం నిర్వ హించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నా రు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి రెవెన్యూ సద స్సుల ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. అనం తరం రైతుల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్ప కుమారి, టీడీపీ నాయకులు కమతం లక్ష్మీరెడ్డి, పుల్లారెడ్డి, వెదుర్ల నాగేశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

బేతంచెర్ల: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న రెవెన్యూ సదస్సులు రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమేనని సద్వినియోగం చేసుకోవా లని తహసీల్దార్ ప్రకాష్‌బాబు సూచించారు. గురువారం కొలుములపల్లె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. బలపాలపల్లె, కొలుముల పల్లె, పాపసాని కొట్టాల గ్రామాలకు చెందిన రైతు లు భూ సమస్యల పరిష్కారం కోసం అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రకాష్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం అర్జీ లు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు. ఆన్ లైన్‌లో భూములు ఎక్కించాలని, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని, పట్టాదా రు పాస్ పుస్తకాలు ఉన్న భూములు ఆన్‌లైన్‌లో లేవని 58 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా రని అన్నారు. రైతుల అర్జీలను పరిశీలించి పరి ష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం లో ఆర్‌ఐ హేమంత్ రెడ్డి, ఈసర్వే ఆర్‌ఐ మహే శ్వరరెడ్డి, వీఆర్వో రామ గోపాల్, గ్రామ టీడీపీ నాయకులు ఉన్నం చంద్రశేఖర్, శేషశయనారెడ్డి పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

కోవెలకుంట్ల: భూ సమస్యలు పరిష్కార కోస మే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీ ల్దారు పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని మేజర్ గ్రామ పంచా యతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వ హించారు. తహసీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలు ఉంటే రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్ డీ ప్రకాశ్‌నాయుడు, సీనియర్ అసిస్టెంట్ పుల్లయ్య, వీఆరవోలు ఓబులేసు, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో గ్రామసభలు

దొర్నిపాడు: మండలంలోని కొండాపురంలో గురువారం తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రెవె న్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలకు సంబంధిం చి అర్జీలను స్వీకరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల సెక్రటరీ కొత్తపల్లి సురేంద్ర, టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.



కొండాపురంలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ సుభద్ర

సమస్యలు పరిష్కరించేందుకే సదస్సులు

రుద్రవరం: రైతుల సమస్యలు పరిష్కరించేం దుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు డిప్యూ టీ తహసీల్దార్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని చిత్తరేణిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో నాలుగు దరఖాస్తు లు వచ్చినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో కాలనీలో తిరిగి రెవెన్యూ సదస్సులపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్య క్రమం లో టీడీపీ నాయకులు సంజీవ రాయుడు, సర్వే యర్లు రమణ, వీఆర్వో పుల్లయ్య పాల్గొన్నారు.



చిత్తరేణిపల్లెలో వివరాలు తెలుసుకుంటున్న డీటీ చంద్రశేఖర్



కోవెలకుంట్లలో మాట్లాడుతున్న తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

శిరివెళ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మద్యం విక్రయాల్లో దుకాణదారు లు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆళ్లగడ్డ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ విజయ్ కుమార్ హెచ్చరించారు. శిరివెళ్ల మెట్ట వద్ద ఉన్న మద్యం దుకాణాన్ని ఆయన గురువారం తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరకు మద్యం విక్రయిస్తున్నారా లేదా అని పరిశీలించారు. రికార్డులు, ఇన్వా యిస్‌లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేసినట్లు గుర్తిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపించరాదు

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ భవన పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని జిల్లా ఏపీడబ్ల్యూ ఐడీసీడీఈ వీరయ్య అన్నారు. గురువారం చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయ సమీపంలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.22.5 లక్షలతో భవన పనులు చేస్తున్నారని అన్నారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట ఏఈ హరిష్ ఉన్నారు.

ఊరంతా ప్రేమకథ సభ్యులకు సత్కారం

బనగానపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణానికి చెం దిన పబ్లీ కుర్రోడు ఆలియాస్ జంబులయ్య నిర్మించిన ఊరంతా ప్రేమ కథ యూట్యూబ్ డాక్యుమెంటరీకి రాష్ట్రస్థాయి అవార్డు రావడంతో ఆయనను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ పట్టణంలోని వాసవీభవనంలో గురువా రం సత్కరించారు. ఆయనను క్లాత్‌మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు గుండా రవికుమార్, కార్యదర్శి సాయిరాంల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరిం చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ బనగానపల్లె పట్టణానికి చెంది.న జంబులయ్య 2023లో నిర్మించి ఊరంతా ప్రేమకథ ప్రేక్ష కులను అలరించిందన్నారు. చిన్నసినిమాలు కాకుండా తెరపై వచ్చే సినిమా ల్లో కూడా రాణించాలని, ఇందుకు తన సహకారం ఉంటుందని తెలిపారు. జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య మాట్లాడు తూ తల్లిదండ్రుల ఆశీస్సులతో, దృఢ సంకల్పంతో తన సొంత నిధులతో సినిమా తీసి చక్కగా నటించారని కొనియాడారు. ముందు ముందు మరెన్నో అవార్డులు రావాలని కోరారు. కార్యక్రమంలో జంబులయ్యను ఆయన తల్లిదం డ్రులను బీసీ ఇందిరమ్మ అభినందించారు. కార్యక్రమంలో శ్రీరామ వెంకట సుబ్రమణ్యం, జక్కా శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఊరంతా ప్రేమ కథ సభ్యులను సత్కరిస్తున్న బీసీ ఇందిరమ్మ

రేపు సాగు నీటి సంఘాల ఎన్నికలు



రుద్రవరంలో తాగునీటి సంఘాల ఎన్నికల అధికారులకు సూచనలు ఇస్తున్న తహసీల్దార్

అవుకు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మం డలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ మల్లికా ర్జునరెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో చెరువులు, ఎస్సార్బీసీ ఆయకట్టు కింద 13 నీటి వినియోగదా రుల సంఘాలు (డబ్ల్యూయూఏ) ఉన్నాయన్నారు. వీటి పరిధిలో 114 టెరిటోరియల్ కాన్‌స్టిట్యూషన్స్ (టీసీ)లు ఉండగా, ఓటర్లు 11,619 మంది ఉన్నా రు. ఒక్కొక్క టీసీలోని ఓటర్లు 12 మంది సభ్యుల ను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు సంఘం అధ్య క్షుడిగా, మరొకరు ఉపాధ్యక్షుడిగా, మిగిలిన పది మంది సభ్యులుగా ఉంటారు. ఈ నెల 14వ తేదీ న నామినేషన్ ప్రక్రియ, ఉపసంహరణ, ఓటింగ్ జరగనుంది. మండలంలోని గుండ్లశింగవరం ప రిధిలో 24 టీసీలు ఉండగా 3,787 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే అవుకు నెంబర్ 36 పరిధిలోని 12 టీసీల్లో 1199 మంది ఓటర్లు, శివవరం పరి ధిలోని 12 టీసీల్లో 1150 మంది ఓటర్లు, చెన్నం పల్లె పరిధిలోని 12 టీసీల్లో 966 మంది ఓటర్లు, చనుగొండ్ల పరిధిలోని 12 టీసీల్లో 2038 మంది ఓటర్లు, అవుకు పాలేరు చెరువు పరిధిలోని 6 టీసీల్లో 527 మంది ఓటర్లు, అవుకు తిమ్మరాజు చెరువు పరిధిలోని 6 టీసీల్లో 1146 మంది ఓట ర్లు, సంగపట్నం కోటావాణి చెరువు పరిధిలో 6 టీసీల్లో 136 మంది ఓటర్లు, మెట్టుపల్లె బాలికుం ట్ల కాల్వ పరిధిలో 6 టీసీల్లో 112 మంది ఓటర్లు, వేములపాడు ట్యాంకు పరిధిలోని 6 టీసీల్లో 184 మంది ఓటర్లు, కునుకుంట్ల దీక్షితుల ట్యాంకు ప రిధిలో 6 టీసీలు, 225 మంది ఓటర్లు, ఉప్పలపా డు హయత్‌ఖాన్ ట్యాంక్ పరిధిలో 6 టీసీలు, 149 మంది ఓటర్లు ఉన్నారు.

కొలిమిగుండ్ల: మండలంలోని తిమ్మనాయినిపేట, హనుమంతుగుండం, కొలిమిగుండ్ల, అబ్దులాపురం తదితర గ్రామాల్లోని ఐదు చెరువులకు సంబంధిం చి ఈనెల రేపు శనివారం సాగునీటి సంఘం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద రెడ్డి గురువారం వెల్లడించారు. ప్రభుత్వం ఆదేశా ల మేరకు 14న ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల ఆవరణంలో ఉదయం 8గంటల నుం చి ఎన్నికల అధికారుల పర్యవేక్షణలో ఈ ఎన్నిక లు జరుగుతాయని ఎంపీడీవో వెల్లడించారు. మం డలంలోని ఐదు చెరువులకు సంబంధించి మొ త్తం 2104 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు.

రుద్రవరం: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహించాలని తహసీల్దార్ మల్లికార్జు న రావు అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యా లయం ఆవరణలో ఎన్నికల విధులు నిర్వర్తిస్తున్న అధికారులకు ప్రభుత్వ నిబంధనలు వివరించారు.

దొర్నిపాడు: మండలంలోని కొండాపురంలో గురు వారం తహసీల్దార్ సుభద్ర ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీలను స్వీకరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మాధవ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, టీడీపీ మండల సెక్రెటరీ కొత్తపల్లి సురేంద్ర, టీడీపీ తెలుగు యువత అధికార ప్రతినిధి తాళ్లూరి రమేష్‌నాయుడు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వైభవంగా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



మూడురాళ్లపల్లెలో గణపతి విగ్రహానికి పూజలు

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు రాళ్లపల్లెలో రహదారిలో అభయాంజనేయస్వామి ఆల యం వద్ద దాత బ్రహ్మచారి ఆధ్వర్యంలో గణపతి విగ్రహ ప్రతి ష్ఠ మహోత్సవం గురువారం వేద పండితుడు శివచారి ఆధ్వర్యం లో వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకపూజలు, జల, క్షీరాభిషేకా లు, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గణపతి అభయాంజనేయస్వామి, గణపతి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో శంకర్, ఆదినారాయణ, మురళి, మహిళలు పాల్గొన్నారు.

డెయిరీ డైరెక్టర్ల ఎన్నిక ఏకగ్రీవం

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని ముత్యాల పాడు గ్రామంలో పాల డెయిరీ డైరెక్టర్లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రకటించారు. గురువారం నిర్వహిం చారు. రెండు డైరెక్టర్ పోస్టులు ఖాళీ ఉండటంతో వాటికి ఎన్నిక ల అధికారి చంద్ర నామినేషన్‌లు స్వీకరించారు. టీడీపీ వర్గీయు లు నాగన్న, నడిపన్న నామినేషన్ వేశారు. ఇద్దరే నామినే షన్లు వేయడంతో వీరి ఎన్నిక ఏకగ్రీవమైంది. ఎస్‌ఐలు రమేష్ రెడ్డి, హరిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించా రు. కార్యక్రమంలో పాల చైర్మన్ రమణారెడ్డి, టీడీపీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, గోపాల్‌రెడ్డి, బాలుడు పాల్గొన్నారు.

శిరివెళ్ల, గంగవర గ్రామాల్లో వాయిదా

శిరివెళ్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండలంలోని శిరివెళ్ల, గంగ వరం గ్రామాల్లోని విజయ పాల సహకార సమితి లో ఇద్దరు చొప్పున డైరెక్టర్లను ఎన్నుకునేందుకుగాను అధికారు లు గురువారం ఏర్పాట్లు చేశారు. రెండు గ్రామాల్లో నామినేషన్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో ఎన్నికల ప్రక్రి యను అధికారులు వాయిదా వేశారు. విజయ పాల డెయిరీకి పాలు పోస్తున్నా ఓటర్ల జాబితాలో పేర్లు లేకుండా చేశారని శిరివెళ్లకు చెందిన కామిని నాగేశుడు, మరికొంత మంది పాల ఉత్పత్తిదారులు ఎన్నికల నిర్వహణ అధికారి ప్రదీప్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.

త్వరితగతిన ఫిర్యాదులు పరిష్కరించాలి

● విజిలెన్స్ కమిటీ సభ్యుడు నాగరాజు

డోన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ గ్రామ సభల ద్వారా రైతులు ఇచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యులు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రీసర్వే పేరుతో చేసిన తప్పిదాల వల్ల అనేక మంది రైతులు భూములు ఆన్‌లైన్‌లో కోల్పోయి తీవ్ర క్షోభకు గురవుతున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ల్యాండ్ టైటిల్ యాక్టుపై సీఎం చంద్రబాబు నాయుడు తొలి సంతకం చేసి వాటిని రద్దు చేశారని అన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సభలు ఏర్పాటు చేసి రైతుల నుంచి తీసుకునే అర్జీలకు అధికారులు త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరారు.

మాజీ మంత్రి బుగ్గన మార్నింగ్ వాక్

డోన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం కేవీఎస్ కాలనీలో ఉన్న యోగా పార్కులో గురువారం మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మార్నింగ్ వాక్ నిర్వహించారు. యోగా చేసే వారితో ఆయన ముచ్చటించారు. అనంతరం పట్టణంలోని కొండపేట లో ఇటీవల మృతి చెందిన ఎర్రగుంట్ల నాగిరెడ్డి కుటుంబానికి, పాతపేటలో ఇటీవల మృతి చెందిన నాగసుబ్బారెడ్డి కుటుంబాల కు మాజీ మంత్రి బుగ్గన వెళ్లి వారిని పరామర్శించారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

క్రిష్ణగిరి, డిసెంబరు 12: అధికారులు గ్రామాల్లో అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపీడీవో మోహన్ కుమార్ అన్నారు. గురువా రం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో అధికారులు అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం ఆయా అంశాలపై అధికారులకు శిక్షణ ఇచ్చారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

కొలిమిగుండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రవేశ పెట్టిన తొమ్మిది అంశాల సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణా తరగతులు నిర్వ హించారు. ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారు లు, గ్రామ సచివాలయ ఉద్యోగులకు అవగాహన కల్పించారు.

ఉపాధి పనులపై విచారణ

చాగలమర్రి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.వనిపెంట, శెట్టివీడు, నేలంపాడు గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం ఎస్ఆర్‌పీ మూరాద్, డీఆర్పీలు, ఏపీవో నిర్మల ఆధ్వర్యం లో గురువారం ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. సామాజిక తనిఖీలో భాగంగా ఉపాధి పనుల నివేదికలను ప్రకటించారు. పెద్దబోదనం, మల్లేవేముల గ్రామాల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించకుండా వాయిదా వేశారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనుల్లో చేతివాటం ప్రదర్శించారని టీడీపీ నాయకులు ఆరోపించారు.

శివలింగం ధ్వంసం

డోన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలం లోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న పురాతన బావి ప్రదేశంలో ఉన్న శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసి లింగాన్ని పెకిలించారు. ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు గురువారం డోన్ రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు వెంకటాపురం సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. గుప్త నిధుల తవ్వకాల కోసం బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు శివలిం గాన్ని ధ్వంసం చేసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఒకరికి రిమాండ్

అవుకు, డిశంబరు 12 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసు లో రామాపురం గ్రామానికి చెందిన ప్రకాష్‌గౌడును రిమాండుకు తరలించినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి గురువారం తెలిపారు. అవుకు బస్టాండు సర్కిల్‌లో ప్రకాష్‌గౌడు మద్యం సేవించి వాహనం నడుపు తుండగా అదుపులోకి తీసుకొని డ్రంకెన్ డ్రైవ్ టెస్టు నిర్వహించా మన్నారు. మద్యం తాగినట్లు రుజువు కావటంతో బనగానపల్లె మెజిస్ట్రేట్ వద్ద హాజరు పరచగా 30 రోజుల రిమాండుకు ఆదేశించినట్లు తెలిపారు.

ముగిసిన మెగా జాబ్ మేళా

బనగానపల్లె, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె పట్టణంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా గురువారం ముగిసిం ది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణ శివారులోని నెహ్రూ ఉన్నత పాఠశాలలో జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 35 కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిం చారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలమెంట్ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

● సంక్రాంతి పండుగనాటికి ప్లాస్టిక్ నిషేధానికి పూర్తిగా సహకరించాలని బీసీ ఇందిరమ్మ పట్టణంలోని క్లాత్‌మర్చంట్ అసోసియేషన్ సభ్యులను కోరారు. గురువారం టీడీపీ కార్యాల యంలో నా బనగానపల్లె నా ఆరోగ్యం లోగోను, టీషర్టులు, టోపీ, లోగో స్టిక్కర్లు ఆవిష్కరించారు.